శామీర్‌పేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం పొన్నాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో వజ్రేష్‌యాదవ్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గూడు లేని పేద, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తారని చెప్పారు. ప్రజా సంక్షేమానికి మునుపెన్నడూ లేని విధంగా పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వజ్రేష్‌యాదవ్ చెప్పారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు సాయిపేట శ్రీనివాస్, గడ్డం రమేశ్, దోసకాయల వెంకటేశ్, బత్తుల కిశోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, పార్టీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించేలా కార్యాచరణ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణిచ్చి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా అధికారులు కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్కిల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ అధ్యక్షతన 16మంది సభ్యులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశారన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. చిన్న పరిశ్రమల స్థాపన, స్టార్టప్ కల్చర్, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థలు, ఆర్మీ, బ్యాంక్ రిక్రూట్మెంట్ వివరాలను యువతకు తెలియజేసి ఉద్యోగాలు సాధించేలా శిక్షణివ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎంప్లాయ్‌మెంట్ అధికారి అబ్దుల్‌సుభాన్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధికారులు మల్లేశం, కమలాకర్‌రెడ్డి, డీపీవో మోహన్‌రెడ్డి, స్పోర్ట్స్ అధికారి హన్మంతరావు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులను ఆదుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పండ్ల తోటల రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్ అన్నారు. శనివారం చౌదర్‌పల్లి రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్‌ను వందశాతం రాయితీతో ఇస్తామన్నారు. సన్న, చిన్నకారు రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీ వర్తింపజేస్తున్నట్టు చెప్పారు. చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని రైతులను ఆదుకుంటామని చెప్పారు. పవర్ టిల్లర్లు, డ్రోన్లు, మల్చింగ్ తదితర వసతులు కల్పిస్తామని తెలిపారు. కోతుల బెడద నివారణపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సోలార్ పవర్ వినియోగానికి రైతులు చొరవ తీసుకోవాలన్నారు. పందిరి సాగుకు రాయితీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరానికి కూరగాయలు, ఆకుకూరలు రవాణా చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఇదిలా ఉంటే అడవి పందులు, జింకల బెడద నివారణకు రాయితీపై సోలార్ ఫెన్సింగ్ యూనిట్లు మంజూరు చేయాలని రైతులు పీడీ సురేష్‌ను కోరారు. ఇందుకాయన సానుకూలంగా స్పందించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ ఏడీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు భేష్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కాయకల్ప వైద్య బృందం

షాద్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో సదుపాయాలు భేష్‌గా ఉన్నాయని కాయకల్ప బృందం కితాబిచ్చింది. శనివారం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిని బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు వైప్రజ్ఞారెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు అందజేస్తున్న చికిత్సలు, సేవలపై సంతృప్తి వ్యక్త చేశారు. ఆస్పత్రిలో శానిటేషన్, రోగుల పట్ల సిబ్బంది ప్రవర్తన కూడా బాగున్నాయన్నారు. ఆస్పత్రి పర్యవేక్షణాధికారి శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.

నాపరాతి వ్యర్థాలు రోడ్డుపక్కనేస్తే చర్యలు



గౌతాపూర్-కరన్‌కోట్ రోడ్డు పక్కన పారబోసిన నాపరాతి ముక్కలు

తాండూరు రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నాపరాతి వ్యర్థాలను రోడ్డుపక్కన పారబోస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. గౌతాపూర్ శివారులోని గోపన్‌పల్లి గ్రామాల నాపరాతి పాలిషింగ్ యూనిట్ నుంచి వెలువడుతున్న నాపరాతి వ్యర్థాలను అబ్దుల్ హాజీజ్ అనే వ్యక్తి రోడ్డుకు ఇరువైపులా పారబోస్తున్నారని గౌతాపూర్ పంచాయతీ కార్యదర్శి పక్రోజీ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శనివారం తెలిపారు. ఈ వ్యర్థాలతో గౌతాపూర్-కరన్‌కోట్ రోడ్డులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదానికి దారితీస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు. పాలిషింగ్ యూనిట్ల యజమానులు వ్యర్థాలను రోడ్డు పక్కన పారబోస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. ఇప్పటికే వేసిన వ్యర్థాలను యజమానులతో తీయిస్తామని ఎస్సై తెలిపారు.

పరిగి లాయర్‌కు 'సుప్రీం'లో సన్మానం



విశాలను సన్మానిస్తున్న రిటైర్డ్ సీజే కేజీ.బాలకృష్ణన్

పరిగి,మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పరిగి కోర్టు బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అందె విజయ్‌కుమార్ కూతురు అందె విశాల హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. చిన్న వయసులోనే సుప్రీం కోర్టు ఆల్ ఇండియా బార్ అసోషియేషన్‌లో సభ్యత్వం తీసుకుని అక్కడే ప్రాక్టీస్ చేస్తున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఢిల్లీలో సుప్రీం కోర్టు హాల్‌లో రిటైర్డ్ సీజే కేజీ.బాలకృష్ణన్, ఇతర జడ్జిలు, న్యాయవాదుల చేతుల మీదుగా సన్మానాన్ని అందుకున్నారు. సన్మానాన్ని అందుకోడం సంతోషంగా ఉందని న్యాయవాది విశాల తెలిపారు.

మోకిల సీఐ వీరబాబుకు రివార్డు



రివార్డు అందుకుంటున్న సీఐ వీరబాబు

శంకర్‌పల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మోకిల సీఐ వీరబాబు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి నుంచి రివార్డు అందుకున్నారు. కమిషనరేట్‌లో శనివారం సీపీ నుంచి రివార్డు అందుకున్నారు. మీర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డినగర్‌లో 2024లో ఏప్రిల్‌లో భార్యను భర్త హత్య చేసిన ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి చార్జిషీట్ వేశారు. 2025 ఫిబ్రవరిలో నిందితుడికి జీవిత ఖైదు పడింది. కేసును ఛేదించడంలో వీరబాబు కృషిని గుర్తిస్తూ సీపీ, అడిషనల్ సీపీ గజరావు భూపాల్‌లు సీఐని ప్రత్యేకంగా అభినందించి రివార్డు అందజేశారు.

మహేశ్వరాన్ని ఫ్యూచర్ సిటీలో కలిపేందుకు కృషిచేస్తా



కేఎల్లార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు

మహేశ్వరం, మార్చి22(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం మహానగరంగా మారాలంటే దాన్ని ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాలన్న జేఏసీ విజ్ఞప్తిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఫ్యూచర్‌సిటీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కేఎల్లార్, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. వారితో కేఎల్లార్ మాట్లాడుతూ.. భవిష్యత్తు బాగుండాలంటే మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిగా ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాల్సి ఉంటుందన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తానన్నారు. మహేశ్వరం రానున్న రోజుల్లో మహానగరంగా మారబోతోందన్నారు. ప్రభుత్వ పెద్దలతో తనకున్న పరిచయాలతో తాను మహేశ్వరాన్ని ఫ్యూచర్‌సిటీలో విలీనం చేసేంత వరకు పోరాటం చేస్తానని జేఏసీ నాయకులకు కేఎల్లార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యూచర్‌సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, గౌరవాధ్యక్షుడు మనోహర్, వి.మల్లేష్‌యాదవ్, ముఖ్య సలహాదారులు కడారి జంగయ్యయాదవ్, యాదగిరిరెడ్డి, కట్టెగొమ్ముల జగన్‌రెడ్డి, చంద్రయ్య, అంద్యానాయక్, సుదర్శన్‌యాదవ్, సుదర్శన్‌రెడ్డి, కాకి ఈశ్వర్, రవికుమార్, బి.నర్సింహయాదవ్, దత్తునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లతోనే భవిష్యత్తు

ఆదిభట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని, నీరు లేకపోతే భవిష్యత్తు లేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా భారత వ్యవసాయ ఇంజనీర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ కొంగరకలాన్ పరిధిలోని శ్లోకా కన్వెన్షన్‌లో తెలంగాణ జల వనరులు, నీటి యాజమాన్యంపై శనివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో జాతీయ అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలతో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నీటిని విచక్షణా రహితంగా వాడకూడదని చెప్పారు. నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పెరిగి సమస్యలు తప్పవని వక్తలు హెచ్చరించారు. సమర్థవంతమైన నీటి యాజమాన్యం కోసం రాబోయే రోజుల్లో పలు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో రైతు మార్గదర్శి పద్మశ్రీ చింతల వెంకటరెడ్డి, డాక్టర్ కె.ఎల్లారెడ్డి, నీటి యాజమాన్య నిపుణులు పీఆర్పీ సుందర్‌రావు తదితరుల పాల్గొన్నారు.



జల దినోత్సవ సదస్సులో చిన్నారెడ్డి, కోదండరెడ్డి, నిపుణులు

అభివృద్ధి పనులకు శ్రీకారం

తలకొండపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జాల గ్రామ పరిధి ఇస్రాయిపల్లిలో శనివారం భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో రూ.5లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ అజీజ్, ఆరిఫ్, రాజు, విష్ణు, రమేశ్, అఫ్జాట్, శ్రీశైలం, వెంకటేశ్, జంగయ్య, కిరణ్, బాలకృష్ణ, సాయికిరణ్, బాలస్వామి, నరేశ్, లక్ష్మయ్య, రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్యారెంటీల అమల్లో ప్రభుత్వం విఫలం



షాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలిచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ వాటిని అమలులో విఫలమైందని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, బీజేపీ నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, రాములుగౌడ్, ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి షాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్నీ కేంద్రానివే అన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఏడాదిలో కేంద్రం రూ.90వేల వరకు లబ్ధి చేకూరుస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాణయ్య, శ్రీధర్‌రెడ్డి, పీసరి సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిరణ్, వెంకటేష్‌గౌడ్, హరీష్, సురేష్, మహేందర్, నారాయణ, జనార్దన్‌రెడ్డి, గోవర్దన్, విజయ్‌కుమార్, గణేష్, విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

కులకచర్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చేవేళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కులకచర్లలోని బాలుర పాఠశాలలో భాగంగా జీకేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల శుభ్రపర్చేందుకు ట్రక్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, అంజిలయ్య, ఈశ్వరయ్య, వెంకటయ్యగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, సౌమ్యారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, జానకిరామ్, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేదునూరులో వేంకటేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నేదునూరులో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని నిర్వహించారు. ధర్మకర్త, వేద పండితులు రామశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6:30 నుంచి 10గంటల వరకు గ్రామ వీధుల్లో రథాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.రామక్రిష్టారెడ్డి, నాయకులు జి.శమమంతప్రభాకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాచారంలో తిరుమలేశుడి కల్యాణోత్సవం



అలంకరణలో స్వామి వారు

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యాచారంలోని తిరుమలేశునిగుట్టపై గల ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం కనుల పండువగా జరిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు చేసి మధ్యాహ్నం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మరోజు కళమలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

'భూ కబ్జాపై ప్రశ్నిస్తే కేసు బనాయిస్తున్నారు'

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రియల్టర్లు తమ భూమి కబ్జాచేసి ప్రశ్నిస్తున్న తమపై ఉల్టా కేసు పెడుతున్నారని కొర్రెములకు చెందిన గోపు బాల్‌రాజ్, ముంత శ్రావణ్, కృష్ణ, బాలకృష్ణ, నాగేష్, రమేష్ ఆరోపించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. 60యేళ్ల క్రితం కొర్రెములలోని సర్వే నంబర్లు 402, 396, 395, 394, 387లలోని 11ఎకరాల 2గుంటల భూమిని కొని సాగుచేస్తున్నట్టు చెప్పారు. ఈ భూమి పార్టీషన్ కాలేదని, అందరం కలిసే సాగు చేస్తున్నామని తెలిపారు. కాగా ఇందులో ఇద్దరు పట్టాదారులు మెట్టు సత్తయ్య, ముంత మల్లేష్ రెండెకరాల 10గుంటల భూమిని మణదీప రియల్ ఎస్టేట్ సంస్థకు అమ్మారన్నారు. సదరు సంస్థ 2ఎకరాల 10గుంటలకు బదులు 2ఎకరాల 20గుంటలను కబ్జాచేసిందన్నారు. ఇదేందని అడిగితే తమపై కేసులు పెడుతున్నారని వాపోయారు. డప్పోనివాగు, ప్రభుత్వ భూమినీ కబ్జా చేస్తున్నారని కలెక్టర్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు పట్టించుకోవడం లేదన్నారు.

పార్టీ పటిష్టతకు పనిచేద్దాం : రాజ్‌భూపాల్‌గౌడ్



రాజ్‌భూపాల్ గౌడ్‌ను సన్మానిస్తున్న బుక్క వేణుగోపాల్

శంషాబాద్ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ పటిష్టతకు అందరం పనిచేద్దామని బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శనివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుక్క వేణుగోపాల్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ టి.శ్రీనివాస్‌రెడ్డి శాలువాలు కప్పి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, నాయకులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కుమార్‌యాదవ్, నర్కూడ మాజీ సర్పంచ్ సిద్ధులు, సంజీవ, గోపాల్, నగేష్‌గౌడ్, కుమార్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించాలి : ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న చోట తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు తదితర వసతులు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లను, ఇతర సిబ్బందిని ఆదేశించారు. 'కూలీల అనాసక్తి' శీర్షికన ఈ నెల 8న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి శనివారం ఎంపీడీవో స్పందించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఎంపీడీవో అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో పెట్టాలని, పని చేసే చోట నీడ కోసం టెంట్లు వేయించాలని ఆదేశించారు. మెడికల్ అధికారులతో మాట్లాడి ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లను ఇవ్వాలని సూచించినట్టు చెప్పారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

ప్రతి గ్రామంలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పన్నుల వసూళ్లపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో 500 నుంచి 600 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని చెప్పారు. ఫామ్‌పాండ్ల నిర్మాణాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కూలీలకు పని కల్పించని వారిని బదిలీ చేస్తామని చెప్పారు. త్వరలో జరిగే సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు. నిబంధనల మేరకు కూలీలకు పని కల్పించకుంటే మండలం రూ.కోటి మేర ఆదాయం కోల్పోతుందన్నారు. సమావేశంలో ఏపీవో లింగయ్య, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.

FLAT FOR SALE

★ 1 BHK flat at Saroor Nagar, near Global Aware Hospital, with good ventilation and water. Contact. 96768 60293 AJH-1834

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఈదురు గాలులు.. వడగండ్లు

● ఉరుములు, మెరుపులతో భారీ వర్షం ● మామిడి రైతులకు నష్టం ● విద్యుత్ అంతరాయంతో ప్రజల ఇబ్బందులు


మర్పల్లి: బిల్కల్‌లో కురిసిన వడగండ్ల వర్షం


మర్పల్లి: వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న ఉల్లిపంట


వికారాబాద్: నవాబుపేటలో ఈదురుగాలులకు రోడ్డుపై విరిగి పడిన చెట్టు

వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో శుక్రవారం అర్ధరాత్రి, శనివారం ఉరుములు మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. ఎండ వేడిమికి ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం ఈ వర్షంతో ఉపశమనం పొందారు. అయితే ఈదురు గాలులకు భారీ చెట్లు నేలకొరిగాయి. పలు చోట్ల ఇళ్లగోడలు కూలాయి. వడగండ్ల వర్షం కురియడంతో రైతులకు నష్టం వాటిల్లింది. మామిడి పిందెలు నేలరాలాయి. కూరగాయలు, ఆకు కూరలు, వరి, జొన్న, గోదుమ తదితర పంటలు వడగండ్ల వర్షంతో దెబ్బతిన్నాయి. వారం రోజుల్లో చేతికొచ్చే మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


మర్పల్లి: వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న జొన్నపంట



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్, చందుపట్లగూడలో రోడ్లపై కూలిన చెట్లు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న బాలాజీనగర్ కాలనీవాసులు

మేడ్చల్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పలు కాలనీ వాసులు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి బాలాజీనగర్, వెంకటరామిరెడ్డి నగర్, ఉమానగర్‌లతో పాటు పరిసరాల్లోని అన్ని కాలనీలకు సక్రమంగా నీటి సరఫరా అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రహోమం

కులకచర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా రుద్రహోమం, రుద్రాభిషేకం తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రుద్రహోమంలో దంపతులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ కార్మికులకు పురస్కారాలు

మేడ్చల్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్, కండక్టర్లకు శనివారం ప్రగతి చక్రాల పురస్కారంతో డిపో మేనేజర్ సుధాకర్ సన్మానించారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో అత్యధికంగా ఇన్సెంటీవ్ పొందిన కండక్టర్లకు, అత్యధికంగా ఇంధనం పొందిన డ్రైవర్లకు పురస్కారం అందజేశారు.

రూ.9.10లక్షలకు తైబజారు వేలం

కులకచర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కులకచర్లలో తైబజారు వేలంను శనివారం తహసీల్దార్ మురళీధర్, ఎంపీవో భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో ఐదుగురు సభ్యులు పాల్గొనగా అదేగ్రామానికి చెందిన పర్సాపూరం వెంకట్రాములు రూ.9లక్షలా 10వేల 50కు వేలాన్ని దక్కించుకున్నాడు. ఏడాది పాటు తైబజారు వసూలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ

వికారాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పండుగ సందర్భంగా శివారెడ్డిపేట ప్రముఖ వ్యాపారవేత్త సయ్యద్ ఇక్బాల్ శనివారం శివారెడ్డిపేటలో పేదలకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. 10రకాల ఆహార సామగ్రిని వెయ్యి మందికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఇక్బాల్, షబ్బీర్ హుస్సేన్, జమీర్ హుస్సేన్, అబీర్, అమాన్, అర్హన్ పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

వికారాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీహర్ష కన్సల్టింగ్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీధర్‌రెడ్డి అన్నారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోనిప్రభుత్వ పాలిటెక్నికిక్ కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీత లక్ష్మీ పట్నాయక్, అధ్యాపకులు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కులకచర్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్యాటగడ్డ కాలనీలో నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప తన వంతుగా రూ.లక్ష విరాళం ప్రకటించారు. శనివారం ఆలయాన్ని సందర్శించిన ఆయన పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిపాల్, గుడాల వెంకటేశ్ పాల్గొన్నారు.

కందులు, వేరుశనగ బీట్లు

ధారూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం కందులు, వేరుశనగ పంట ఉత్పత్తుల బీట్లు నిర్వహించారు. కందులు క్వింటాలుకు రూ. 7,200ల నుంచి రూ.7,375ల వరకు ధర పలికింది. వేరుశనగ క్వింటాలుకు రూ.5,800ల నుంచి రూ.6,200ల వరకు ధర పలికింది. కందులు 167 క్వింటాళ్లు, వేరుశనగ 22.8 క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్


మోమిన్‌పేట్: ఇఫ్తార్ విందుకు హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కుమార్తె అనన్య

ఘట్‌కేసర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు.. ఘట్‌కేసర్‌లోని జామ మసీదు వద్ద ముస్లింకు ఇచ్చిన ఇఫ్తార్ విందును శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అన్ని మతాల పండులగకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు యాదవ్, ముల్లి పావని, మహేష్, ఆంజనేయులు, అజయ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో స్పీకర్ కుమార్తె అనన్య

మోమిన్‌పేట్: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో, కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేపట్టడం అభినందనీయమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కుమార్తె అనన్య చేతన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సూపర్ డీలక్స్ ఫంక్షన్ హాలులో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సీఐ వెంకట్, ఎస్సైలు అరవింద్, సురేశ్, నాయకులు పాల్గొన్నారు.

హిందూముస్లింలు సోదరభావంతో మెలగాలి

దోమ: హిందూ ముస్లింలు సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని మాజీ జెడ్పీటీసీ కొప్పుల నాగిరెడ్డి అన్నారు. దోమ మండలంలోని బొంపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు షఫీ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. కులమతాలకతీతంగా గ్రామాల్లో రంజాన్ వేడుకలు జరుపుకోవడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ గౌడ్, హనుమంతునాయక్, మాజీ ఎంపీటీసీలు రాములు, నవాజ్‌రెడ్డి, బొంపల్లి గ్రామ ముస్లిం సోదరులు, యువకులు పాల్గొన్నారు.


దోమ: బొంపల్లిలో ఇఫ్తార్ విందులో మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి

‘పది’ పరీక్షలు రెండో రోజూ ప్రశాంతం

వికారాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి పరీక్షలు రెండవరోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా హిందీ పరీక్షకు 69 పరీక్షకేంద్రాలు ఉండగా 12,902 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. 12,843 మంది హాజరయ్యారు. వివిధ కారణాలతో 59మంది గైర్హాజరయ్యారు. రెండో రోజు 99.54శాతం విద్యార్థుల హాజరు నమోదైంది. డీఈవో రేణుకాదేవి, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు 30కేంద్రాలను తనిఖీ చేశారు. పోలీసులు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. తాండూరులో శనివారం సెయింట్ మార్క్స్, సెయింట్ మేరీ హైస్కూళ్లలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ సందర్శించారు.


తాండూరు: పరీక్ష కేంద్రం తనిఖీలో సబ్‌కలెక్టర్


కొడంగల్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్ విజయ్‌కుమార్

విద్యార్థులకు స్టీల్ గ్లాసుల పంపిణీ


విద్యార్థులతో దాత సరిత, ఉపాధ్యాయులు

పరిగి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పొట్టిగారి నర్సింహారెడ్డి స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో పరిగి మండలం తొండపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకురాలు పి.సరిత శనివారం స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. గ్లాసుల తోపాటు, ఒక పూట మంచి పౌష్టికాహారంతో భోజనం పెట్టారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు నందీశ్వర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యస్థాపనకు యువత ముందుకు రావాలి

తాండూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : బహుజన రాజ్యస్థాపనకు యువత ముందుకు రావాలని బహుజన సమాజ్ పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ దాగిల్ల దయానంద్‌రావు అన్నారు. బహుజన సమాజ్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిగా తలారి నరేందర్‌కు శనివారం నియామకపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లాలో బహుజన సమాజ్ పార్టీని గ్రామాలలోకి తీసుకెళ్లి ప్రతిష్ఠం చేయాలని కోరారు. స్టేట్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా పూర్తి కమిటీ, అసెంబ్లీ నియోజకవర్గ, సెక్టార్, బూత్ స్థాయి కమిటీలను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రటరీ గుండెల ధర్మేందర్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ కేజీబీవీలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి బాబుసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి పోస్టుకు విద్యార్హత 7వ తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలని సూచించారు. వంట మనిషిగా అనుభవం సైతం ఉండాలన్నారు. ఆసక్తి ఉండి అర్హతగల వారు మండల విద్యాధికారి కార్యాలయంలో సోమవారం సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మోమిన్‌పేట్: మండలంలోని వెల్చాల్ కాంప్లెక్స్ స్థాయి పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చారు. దుర్గంచెరువు పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుపొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సంతోష్‌కుమార్, రమేశ్, సత్యానందం, రాజేందర్, హనుమంతు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

కొడంగల్: పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 78వ వారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం విజయోత్సవ కార్యక్రమాన్ని ఏప్రిల్ 12న నిర్వహించనున్నట్లు హిందూ వాహిని సభ్యులు, యువకులు తెలిపారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం కరపత్రాలను ఆవిష్కరించారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

పెద్దేముల్: మండలంలోని ఇందూరు గ్రామంలో జాతీయ ఉపాధిహామీ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణం పనులను శనివారం కాంగ్రెస్ నాయకులు ఇందూరు నరేందర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్, మాజీ సర్పంచ్ ప్రకాశం, బంద్యప్ప, బహబూబ్‌బేగ్, గొట్లపల్లి నర్సింహులు పాల్గొన్నారు.

పూడూరు: రాకంచర్లలో శనివారం రూ.20లక్షల ఎమ్మెల్యే నిధులతో సీసీరోడ్డు పనులను రాకంచర్ల మాజీ సర్పంచ్ పెంటయ్య ప్రారంభించారు.

నోట్‌బుక్స్, పెన్నుల పంపిణీ

కోట్‌పల్లి: మండలంలోని నాసన్‌పల్లి గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ పార్టీ ఉమ్మడి బంట్వారం మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎన్నారం యాదయ్య శనివారం నాసన్‌పల్లి, నాసన్ పల్లి తండా, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, రాగిజావా తాగడానికి గ్లాసులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్చిరాం, మేగవత్ భారత్, ఆంజనేయులు, రమేష్, యాదిరెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రాలను వినియోగించుకోవాలి

యాలాల: ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని యాలాల మండల పరిషత్ ఎంపీవో యాదయ్య అన్నారు. ఆయన మండలంలోని యాలాల, అగ్గనూరు పరిధిలోగల లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో గ్రామ పంచాయతీల ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దౌల్తాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.25 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, మండల నాయకులు మల్లేశం, మంజుల దస్తప్ప, కుర్మని వెంకటప్ప, మల్కప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆశప్ప, సాయిలు తదితరులు శంకుస్థాపనతో ప్రారంభించారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు కాశయ్య మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య, అనిల్‌కుమార్, వెంకటయ్య, భవాని, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్

తాండూరు రూరల్: మండలంలోని జినగుర్తి గేటు సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లో శనివారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. 50 రకాల వంటకాలతో విద్యార్థులు వంటకాలను ప్రదర్శించారు. తెలంగాణ వంటకాలతో పాటు సరిహద్దులో ఉన్న కర్ణాటక వంటకాలనూ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు తగదు

కులకచర్ల: ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదివాసీ మహిళా కార్పొరేటర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆదివాసీ జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, విఠల్‌నాయక్, రవీంద్రనాయక్, నర్సింహా నాయక్, వినోద్, గోపాల్, విష్ణు తదితరులు అన్నారు. కులకచర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆదివాసీ మహిళలపై అహంకారపూరితమైన అనుచిత వ్యాఖ్యలు చేయడం సభ్యత కాదని, వెంటనే గిరిజనులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను బాగుచేద్దాం


స్వచ్ఛ ట్రక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ధారూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బాగుచేసేందుకు ప్రతీఒక్కరు బాధ్యత తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ధారూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ట్రక్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో 80శాతం పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవని అన్నారు. రాష్ట్రంలో పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, కేఏస్ రత్నం, వి.నందు, రాజునాయక్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను మెరుగుపర్చాలి

పరిగి: పరిగి ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను మెరుగుపర్చాలని టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు వి.పెంటయ్య ఆధ్వర్యంలో శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ నాయకులు వెన్నె ఈశ్వరప్ప, ఎం.పరమేశ్వర్‌రెడ్డి, జానకిరామ్ తదితరులు ఉన్నారు.

కట్టమైసమ్మకు ఎమ్మెల్సీ కవిత పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయానికి ఎమ్మెల్సీ కవిత విచ్చేసి అమ్మవారును భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి శనివారం రాజీవ్‌రహదారి మీదుగా కొమరవెల్లికి మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్తుండగా మార్గమధ్యలో శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం వద్ద పండిత వేదబ్రహ్మణులు కవితను అమ్మవారు ముందు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

మేడ్చల్ టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ తక్కెడపల్లి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన రజమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించి పలు కళాశాలల విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కళాశాలలకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బాలా రెడ్డి, కార్యదర్శి టి.వి.రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్సీని కలిసిన మాజీ ఎంపీపీ


ఎమ్మెల్సీ కొమురయ్యకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల గెలుపొందిన బీజేపీ ఎమ్మెల్సీ మల్క కొమురయ్యను శనివారం నగరంలోని ఆయన నివాసంలో మాజీ ఎంపీపీ, బీజేపీ నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లాల రాజశేఖర్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

పరిగి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఛలో అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పరిగి పోలీసులు శనివారం ఉదయమే బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. పోలీసులు నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో పరిగి మాజీ మునిసిపల్ చైర్మన్ అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బి.రవికుమార్, జగన్ ఉన్నారు.

తాండూరు: అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో భాగంగా వెళ్తున్న తాండూరు బీఆర్ఎస్వీ తాండూరు నియోజకవర్గ నాయకులను శనివారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు జోగుల ఎబినేజర్ మాట్లాడుతూ అరెస్టులను ఖండించారు. అరెస్టయిన వారిలో బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయరావు, పట్టణ అధ్యక్షులు సందీప్, రజక నర్సింహులు, వినోద్ కుమార్, తదితరులు ఉన్నారు.

ఇంటి నంబర్లు కేటాయించాలి

పరిగి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పరిగి మునిసిపల్ పరిధిలోని తుంకులగడ్డలో పేదలు కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు ఇంటినంబర్లు, విద్యుత్, తాగునీటి కనెక్షన్‌లు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య మాట్లాడుతూ ఏడాదికాలంలో ఇంటి నెంబర్లు ఇవ్వనికారణంగా ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, అశోక్, బురాన్, జాకీర్, గఫార్ ఉన్నారు.

కొబ్బరికాయలు, లడ్డూ విక్రయాలకు వేలం


వేలం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

యాలాల, మార్చి 22, (ఆంధ్రజ్యోతి): జుంటుపల్లి రామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని జాతరలో కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర ప్రసాదం విక్రయానికి శనివారం వేలం నిర్వహించారు. ఇందులో టెంకాయల విక్రయానికి రూ.2లక్షల 50వేలు, లడ్డూ, పులిహోర విక్రయానికి రూ.2లక్షల 65వేలు మొత్తంగా రూ.5.15లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ జె.శ్యాంసుందర్‌రావు, మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా రెండు నెలల హుండీ రూ.47వేల 157లు ఆదాయం వచ్చిందని వారు పేర్కొన్నారు.